ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించేందుకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాను రూపొందించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవెల్ అధికారి ఉండాలని, ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి ఫారం 6, మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. ఓటరు జాబితా తప్పులు లేకుండా ఉండేందుకు తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్, తహసీల్దార్ చాంద్‌పాష, ఈడీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన వరద

ధరూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. జలాశయంలోకి 51వేల క్యూసెక్కులు చేరుతుండగా, 3 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా దిగువకు 58 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ఆలమట్టిలోకి 14వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 11 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 11,800 క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 20వేల క్యూసెక్కులు వదులుతున్నారు. జూరాలకు పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా వరద పెరిగినట్లు అధికారులు వివరించారు.

శంకరా.. శీతకన్ను వీడేనా?




శంకరసముద్రం కుడి కాలువ వద్ద తాత్కాలిక ఎత్తిపోతలు

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ఏర్పాటుకు సరిగ్గా పదేళ్ల ముందు పురుడు పోసుకున్న శంకరసముద్రం జలాశయం ఇంకా పసికందులా తడబడి పూర్తికాక ఇటు నిర్వాసితులు అటు ఆయకట్టు రైతులు నిరీక్షిస్తున్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.10 కోట్ల అంచనాతో ఎత్తు పెంచాల్సిన శంకరసముద్రం కోసం గ్రామానికి పునరావాసం అవసరమైంది. ఇలా ఎత్తు పెంచే జలాశయంలో 1.818 టీఎంసీల నీటి నిల్వతో 65 వేల ఎకరాల పై చిలుకు సాగు కుడి, ఎడమ కాల్వ పరిధిలో ఉంటుందని అంచనా వేశారు. గ్రామానికి కల్పించాల్సిన పునరావాసంలో పస లేకపోగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో తాత్సారం, తారతమ్యాలు శంకరసముద్రం పనుల పూర్తికి అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. కొత్తగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జలాశయాన్ని, పునరావాస పనుల్ని పరిశీలించేందుకు వస్తున్న క్రమంలో 'న్యూస్‌టుడే' కథనం.

ఈనాడు మీ తోడు

కాల్వలు పూర్తయినా.. శంకరసముద్రం పూర్తవుతోంది. కుడి, ఎడమ కాల్వలు సిద్ధం చేసి ఆ వెంటనే సాగు నీరిచ్చే లక్ష్యంగా ఎడమ కాలువ 97 కిలోమీటర్ల పొడవున(కొల్లాపూర్ వరకు) పనులు పూర్తయ్యాయి. ఇటు కుడి కాల్వ 19వ ప్యాకేజీ పరిధిలో దేవరకద్ర వరకు పలు గ్రామాలకు కాల్వల నిర్మాణ పనులు 2014కు ముందే పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్వాసితులకు పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందే (2013లో)కానాయపల్లి నిర్వాసితులకు రూ. 18 కోట్ల పరిహారం అందించి. తెలంగాణ ఏర్పాటయ్యాక 118 ఎకరాల స్థల సేకరణ, ఇళ్ల స్థలాల కేటాయింపు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వంటి ప్రగతిని సాధించింది. పునరావాసం కల్పించే పనుల్లో నిధులలేమి నిర్వాసితుల డిమాండ్లు ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో ఇటు రైతులకు, అటు నిర్వాసితులకు శాపంగా మారింది.

వైఎస్ పేరు నిలపాలి




రైతు ప్రయోజనాలు ఆశిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం పేరుతో శంకరసముద్రానికి శ్రీకారమయ్యింది. ఆయన ఆశయాన్ని ఆ తర్వాత కాలంలో నీరుగార్చారు. నిర్వాసితుల డిమాండ్లు విస్మరించారు. 2005 నుంచి ఇప్పటి వరకు 18 ఏళ్ల నిండిన వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. సర్వే ఆధారంగా 95 మందిని గుర్తించినా వారికి పరిహారం అందలేదు. ఈ ప్రభుత్వమైనా వీటిని పరిష్కరించి గ్రామానికి కొత్త రూపు తీసుకురావాలి. – నరేందర్‌రెడ్డి, కానాయపల్లి



సమస్య పరిష్కారానికే మంత్రుల పరిశీలన: శంకరసముద్రం జలాశయం పనులు, పునరావాస గ్రామంలో కల్పించాల్సిన వసతులపై గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ కారణంగా ఎప్పుడో పూర్తి కావాల్సిన జలాశయం ఎత్తు పెంపు నిర్లక్ష్యానికి గురైంది. ఇక అలా ఉండదు. అందుకే మంత్రులు దామోదర్ రాజనర్సింహ, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకరసముద్రం సందర్శనకు వస్తున్నారు. సమీక్ష చేసి ప్రాజెక్టు పనుల్ని వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తాం. – మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

వేగానికి కళ్లెమేది?

జాతీయ రహదారి-44పై తగ్గని ప్రమాదాలు



జాతీయ రహదారి-44పై స్పీడ్‌గన్‌తో వాహన వేగాన్ని పరిశీలిస్తున్న అధికారి

న్యూస్‌టుడే, భూత్పూర్, పాలమూరు

జాతీయ రహదారి-44పై ప్రమాదాలతో నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు అతివేగంగా దూసుకెళ్లటం, కూడళ్లు, మలుపుల వద్ద వాహన వేగాన్ని నియంత్రించలేకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. స్పీడ్‌గన్‌తో వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించటం మహబూబ్‌నగర్ జిల్లాకే పరిమితమవుతోంది. ఫలితంగా వాహనాల వేగానికి కళ్లెం పడక రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు. జాతీయ రహదారి-44పై నెలకొన్న పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

మహబూబ్‌నగర్‌లోనే స్పీడ్‌గన్ : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించేందుకు స్పీడ్‌గన్ వాహనాలు అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి జిల్లాకు ఒక వాహనాన్ని కేటాయించారు. ఆ సమయంలో కొత్తూరు నుంచి మానవపాడు మండలంలోని పుల్లూరు వరకు వాహనం తిరుగుతూ వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. జిల్లాల విభజన తర్వాత స్పీడ్‌గన్ వాహనం మహబూబ్‌నగర్‌కే కేటాయించటంతో ఈ జిల్లా పరిధిలోనే వినియోగిస్తున్నారు. వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో కెమెరాలతోనే పోలీసులు వాహన వేగాన్ని గుర్తించి, జరిమానా విధిస్తున్నారు. వాహనం ఒకటే కావటం, ఒకే జిల్లాకు పరిమితవటంతో వాహనదారుల్లో జరిమానాల భయం లేకుండా పోయింది. మరిన్ని వాహనాలు కేటాయించాల్సిన అవసరముంది.

ఏడాదికి 40వేల పైనే.. : మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారిపై రోజూ ఒకటి, రెండు ఠాణాల పరిధిలో స్పీడ్‌గన్ వాహనం వినియోగిస్తున్నారు. 2023లో అతివేగంగా వెళ్లిన 40,298 వాహనాలను గుర్తించి రూ.1,035 చొప్పున జరిమానా విధించారు. 2024లో ఆగస్టు వరకు 20,200 వాహనాలకు జరిమానా విధించారు. వేగంగా వెళ్తున్న వాటిలో కార్లు, ప్రైవేటు బస్సులే ఎక్కువ ఉంటున్నాయి.

అటకెక్కిన తనిఖీలు....: గతంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు నిత్యం రహదారులపై తనిఖీలు నిర్వహించేవారు. కొన్నేళ్ల నుంచి ఎంవీఐ కింద ఏఎంవీఐలు ఉండకపోవటంతో తనిఖీలు జరగడం లేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల్లో ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. పెబ్బేరు, కల్వకుర్తిలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. తగినంత మంది ఏఎంవీఐలు లేక జాతీయ రహదారులపై తనిఖీలు ఉండటం లేదు. పోలీస్, ఎన్‌హెచ్ఏఐ, ఆర్టీఏ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి.



సంయుక్త తనిఖీలు చేపడతాం : వాహనదారులు 80 కి.మీ.ల వేగంతో వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడానికి అనుబంధ శాఖలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. మొదట ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్ వినియోగిస్తాం.
– డి.జానకి, జిల్లా ఎస్పీ, మహబూబ్‌నగర్

పరిమితికి మించి..

బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఇటిక్యాల, ఉండవల్లి (పుల్లూరు) మండలాల మీదుగా జాతీయ రహదారి-44 వెళ్తోంది. రహదారిపై 80 కి.మీ.లు, కూడళ్లు, మలుపుల వద్ద 40 నుంచి 60 కి.మీ.ల మధ్య వేగంతోనే వాహనాలు వెళ్లాలి. గతేడాది ఈ రోడ్డుపై మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 85 ప్రమాదాలు చోటుచేసుకుంటే 35 మంది మృతిచెందారు. 463 మంది గాయపడ్డారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా




సభ్యత్వ నమోదును చూపిస్తున్న ఎంపీ డీకే అరుణ, నాయకులు

అమరచింత, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం అమరచింత పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. మన రక్షణ, సాంకేతిక రంగంలో సాధిస్తున్న ఫలితాలు భవిష్యత్ తరాలకు పునాది అని పేర్కొన్నారు. ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆవాస్ యోజన పథకం ద్వారా వచ్చే నిధులను కలుపుకుని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్యకర్త పది మందికి సభ్యత్వం చేయించాలని, ఇళ్ల కోసం అర్హులైన వారి వివరాలను ఆధార్, రేషన్‌కార్డు నంబర్లతో తీసుకుని తనకు అందజేస్తే కలెక్టర్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. ఎంపీగా తనకు వచ్చే నిధులను సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తామన్నారు. కొండయ్య, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజు, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు, భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు పరుగు పెట్టేనా!

పాలమూరులో నేడు మంత్రుల పర్యటన



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని నార్లపూర్ పంపుహౌజ్ ప్రాంతం

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను పరుగు పెట్టించడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. జులైలో సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో పాలమూరు ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మిత ప్రాజెక్టులను వచ్చే ఏడాది డిసెంబరు చివరినాటికి పూర్తి చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. సమీక్ష జరిగి రెండు నెలలైనా అనుకున్న పురోగతి మాత్రం లేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు నిర్మిత ప్రాజెక్టుల పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.2,792.6 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పనుల పరిశీలన, పురోగతిపై సమీక్ష కోసం బుధవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎటూ తేలని వైనం..: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై అధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది. ఈ పనుల కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో మిగిలిన వాటిపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి వరదనీరు వచ్చినా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. ఇప్పటికే నార్లపూర్, ఏదుల, వట్టెం పంపుహౌస్‌ల్లో నాలుగు పంపుల చొప్పున పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వట్టెం పంపుహౌస్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. ఈ నీటిని తోడేందుకు కనీసం రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. నార్లపూర్ నుంచి ఏదుల వరకు అర కిలోమీటర్ మేర కాలువ పనులు పూర్తి కాలేదు. ఉదండాపూర్‌లో పంపుహౌస్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు రెండో దశలో టెండర్లు పూర్తయిన కాలువ పనులను ప్రస్తుతానికి పక్కన పెట్టారు.

మంత్రుల పర్యటన ఇలా..

- **ఉదయం 10:15 :** జడ్చర్లలోని ఉదండాపూర్ జలాశయం పనుల పరిశీలన
- **ఉదయం 11:15 :** గట్టు ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- **మధ్యాహ్నం 1:00 :** కొత్తకోట మండలంలోని శంకరసముద్రం జలాశయం పరిశీలన
- **మధ్యాహ్నం 3:00 :** పీఆర్ఎల్ఐలో భాగంగా నార్లపూర్ జలాశయం పనుల పరిశీలన
- **సాయంత్రం 4:30 :** వట్టెం రాక జలాశయం పనుల పరిశీలన
- **సాయంత్రం 5:15 :** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

నిర్మిత ప్రాజెక్టులపై.. : ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల ద్వారా 6.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతోంది. అదనపు ఆయకట్టు పనులు పూర్తయితే మొత్తం 8.80 లక్షల ఎకరాలకు సాగునీరందే పరిస్థితి ఉంది. ఈ పనులు పూర్తి చేయడానికి గత బడ్జెట్‌లో రూ.1,469 కోట్లు కేటాయించారు. కాలువల నిర్మాణం, పునరావాస చర్యలు, భూసేకరణ వంటివి చేయాలి. ప్రస్తుతం భారీ వర్షాలకు జలాశయాలు నిండటం, కాలువల్లో నీరు పారుతుండటంతో అదనపు ఆయకట్టు పనులపై ప్రభావం చూపనుంది. కొత్తకోటలోని కానాయపల్లి వద్ద శంకరసముద్రం జలాశయం పరిధిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా పునరావాస ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీనికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. గద్వాల జిల్లాలోని గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు నుంచి నీటిని తరలించాలని భావించినా దీని డిజైను మార్చాలన్న చర్చ జరిగింది. జూరాల జలాశయం పరిధిలోని బ్యాక్‌వాటర్ ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పరిధిలోని రెండోదశ పనులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



జల్లంత.. తుళ్లింత!

వర్షాలతో ప్రకృతి ఆహ్లాదకరంగా మారడంతో మయూరాల సందడి పెరిగింది. మంగళవారం ఉదయం భూత్పూర్ మండలం కొత్తమొల్గర శివారులో మూడు నెమళ్లు ఇలా హద్దురాళ్లపై ఒళ్లు విరుచుకుంటూ కనిపించగా 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

పెబ్బేరులో 59మి.మీ వర్షం

వనపర్తి వ్యవసాయం : సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30గంటల వరకు జిల్లాలో 19.5మి.మీ సాధారణ వర్షపాతం నమోదైంది. పెబ్బేరులో అత్యధికంగా 59.0మి.మీ నమోదు కాగా ఆత్మకూరులో అత్యల్పంగా 6.5మి.మీ వర్షపాతం నమోదైంది. అమరచింతలో 7.1, మదనాపురంలో 7.6, పెద్దమందడిలో 13.1, ఖిల్లాగణపురంలో 13.0, గోపాల్‌పేటలో 9.3, రేవల్లిలో 23.5, పాన్‌గల్‌లో 11.9, వనపర్తిలో 8.6, కొత్తకోటలో 8.3, శ్రీరంగాపురంలో 36.8, వీపనగండ్ల 35.3, చిన్నంబావి 32.7మి.మీ నమోదైందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాణి తెలియజేశారు.

10 యూనిట్లలో జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద వరదనీటి ఉద్ధృతి పెరిగిన నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో పది యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టారు. జల విద్యుదుత్పత్తికి 37,176 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 1.757, దిగువన ఐదు యూనిట్ల ద్వారా 2.066 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడింది. ఎగువన 190.057, దిగువన 164.123 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్ఈ(ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములవండి



వెంగళాయిపల్లిలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి

పాన్‌గల్, న్యూస్‌టుడే : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయితేనే లక్ష్యం నెరవేరుతుందని డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి, పాన్‌గల్ గ్రామాల్లో ఆమె పర్యటించి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో తిరిగి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఏపీఎం సక్రునాయక్ పాల్గొన్నారు.

దరిచేరని ఆరోగ్య లక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనానికి అంతంతే స్పందన

ఈనాడు పరిశీలన



నవాబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది లబ్ధిదారులు ఉండగా భోజనానికి వచ్చింది ముగ్గురే

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం : పుట్టబోయే బిడ్డ తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండాలని, బాలింతలకు తగిన పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్య లక్ష్మి' పథకం లక్ష్యానికి పూర్తిగా దూరమైంది. ఈ పథకం అమలుపై స్త్రీశిశు సంక్షేమ శాఖ చెబుతున్న లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితికి ఎలాంటి పొంతన ఉండటం లేదు. పల్లెలు, పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వాటి పరిధిలోని బాలింతలు, గర్భిణులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు రావాలి. 80 నుంచి 90 శాతం మంది లబ్ధిదారులు రావటం లేదు.

పెరిగిన సమస్యాత్మక ప్రసవాలు : ఆరోగ్య లక్ష్మి పథకం కింద మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు, పుట్టిన శిశువుకు ఆరు నెలలు నిండే వరకు తల్లి(బాలింత)కి అన్నం, పప్పు, చారు, ఉడకబెట్టిన గుడ్డు అందిస్తారు. లాక్‌డౌన్ సమయంలో, అంతకు ముందు ఇంటి వద్దే వండుకుని తినమని గర్భిణులు, బాలింతలకు పప్పు, నూనె, గుడ్లు, పోషక విలువలతో కూడిన బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసేవారు. దాదాపు మూడేళ్లు ఇలా అమలు కాగా అందరూ సరకులు తీసుకునేవారు. 2021 సెప్టెంబరు నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకే వచ్చి భోజనం చేయమని ఆదేశాలు రావడంతో అప్పటి నుంచి భోజనానికి వచ్చేవారి సంఖ్య పూర్తిగా పడిపోయింది. రోజూ కూలీనాలీ చేస్తే తప్ప పూట గడవని కుటుంబాలే అధికంగా ఉండటం, దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేకపోవటమే ఇందుకు కారణం. పల్లెల్లో గర్భిణులు, బాలింతలు వ్యవసాయం, కూలీ పనులకు వెళ్తుంటారు. వారు మధ్యాహ్నం కేంద్రాలకు రాలేని పరిస్థితి. పట్టణాల్లో రకరకాల పనులు చేసుకునే పేదలు, మధ్య తరగతి వాళ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చాలా మంది శిశువులు తక్కువ బరువుతోనే జన్మిస్తున్నారు. గర్భిణులు రక్తహీనతతో బాధపడటం వల్ల ప్రసవం సమస్యాత్మకం(హైరిస్క్)గా మారుతోంది. తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులకు చికిత్సలు చేయించేందుకు కుటుంబాలు రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందరు గర్భిణులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.

తప్పుడు లెక్కలతో సరకులు పక్కదారి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో 8 నుంచి 10 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. ఒకరిద్దరు కూడా భోజనానికి రావటం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 13,202 మంది లబ్ధిదారులకు ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి 10,865 మంది (82 శాతం) భోజనం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాగర్‌కర్నూల్‌లో 13,151 మందికి గాను 9,353 మంది (71శాతం), వనపర్తిలో 9,421 మందికి గాను 5,439 (57శాతం), జోగులాంబ గద్వాలలో 11,102 మందికి గాను 8,790 (79శాతం), నారాయణపేట జిల్లాలో 12,280 మందికి గాను 8,928 మంది (72 శాతం) భోజనం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కలు పచ్చి అబద్ధమని ఏ కేంద్రానికి వెళ్లి పరిశీలించినా, లబ్ధిదారులను అడిగినా తెలిసిపోతుంది. లబ్ధిదారులు రాక వారి కోసం కేంద్రానికి వచ్చే సరకులు పక్కదారి పడుతున్నాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల వాళ్లు రేషన్ దుకాణంలోనే బియ్యం అమ్మేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి జరీనా బేగంని 'న్యూస్‌టుడే' సంప్రదించగా గర్భిణులు, బాలింతలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసేలా టీచర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ పరిస్థితిని చక్కదిద్దితేనే పథకం లక్ష్యం నెరవేరే అవకాశముంది.

నీటి నాణ్యతకు కృషి చేయాలి

కొత్తకోట, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి నాణ్యత మెరుగు పర్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. కొత్తకోటలో మంగళవారం మిషన్ భగీరథ సరఫరా విభాగంలో పని చేసే సిబ్బందికి ఆ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈఈ మేఘారెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో ఏడీసీ మాట్లాడారు. నీటి నాణ్యత, సంరక్షణ ఉండాలని, వీటిపై గ్రామాల్లో ఎలాంటి ఆందోళన చెందని విధంగా సరఫరా ఉండాలని సూచించారు. మేఘారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యామ్నాయ బోరుబావుల విద్యుత్తు మోటార్లు, పంపుసెట్ల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన ఉండాలన్నారు. డీఈఈ జైపాల్‌రెడ్డి, ఏఈఈ శివానంద పాల్గొన్నారు.

సమస్యలు పట్టవంటా!



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం శుచిగా ఉండటమే కాదు.. వంటశాల కూడా శుభ్రంగా ఉండాలి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నింటికి పైకప్పు కూడా లేదు. అపరిశుభ్ర వాతావరణంలో వంట చేస్తుండటం విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది. ఏళ్లుగా ఈ సమస్యలు ఉన్నా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. మహబూబ్‌నగర్ పురపాలిక పరిధి పాలకొండలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తి పైకప్పు ఉన్న రేకుల షెడ్డులో వంట చేస్తున్న దృశ్యం. - ఈనాడు, మహబూబ్‌నగర్

మన లడ్డూలు అంతంతే..!

● నెయ్యి వాడకం లేనేలేదు
● వంట నూనెతోనే తయారీ



పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం

కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యతపై భక్తుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో లడ్డూ ప్రసాదంపై ఆసక్తి నెలకొంది. ఆలయాల్లోని లడ్డూ ప్రసాదం నాణ్యత ఎవరూ పట్టించుకున్న దాఖలా లేదు. తక్కువ ధరకు టెండర్లు నిర్వహించడం, లడ్డు రూ.15కే విక్రయించాలని నిర్ణయించడంతో తయారీలో నెయ్యి వాడే పరిస్థితి లేక కేవలం శుద్ధి చేసిన (రిఫైండ్) వంట నూనె మాత్రమే వినియోగిస్తూ లడ్డూలు తయారు చేస్తున్నారు. దీంతో లడ్డూ నాణ్యత ఉండకపోగా.. పైగా అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. కొవ్వు సంబంధిత ఆయిల్ వినియోగిస్తే దగ్గు, ఉబ్బసం తదితర రోగాలు దరిచేరే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో.. : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 48 ప్రధాన ఆలయాలున్నాయి. దేవాదాయశాఖ వీటిని 6ఎ, 6బి, 6సి కేటగిరీలుగా విభజించింది. ఎక్కువ ఆదాయం, ప్రాచుర్యం పొందిన ఆలయాలను 6ఎలో చేర్చారు. మన్యంకొండ వేంకటేశ్వరాలయం, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం, జమ్ములమ్మ ఆలయం, మల్దకల్ వేంకటేశ్వరాలయం, కాకర్లపాడ్ మైసమ్మఆలయం, గంగాపురం లక్ష్మీ చెన్నకేశవాలయం, ఊర్కొండపేట ఆంజనేయ స్వామి ఆలయం, రంగాపూర్ ఉమామహేశ్వరాలయం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం, సిరసన గండ్ల సీతారామాలయం, నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం, అమ్మాపూర్ కురుమూర్తి ఆలయం, సింగోటం లక్ష్మీనర్సింహాలయం, తిమ్మారెడ్డిపల్లి గురులోక మాసందు ప్రభు మందిరం, వనపర్తి, కొత్తకోట, శ్రీరంగాపూర్‌లోని వనపర్తిరాజావారికి సంబంధించిన గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఉన్నాయి.

కొన్నిచోట్ల గుడిలోనే..

ఆలయాల ప్రసాదాల తయారీలో ముఖ్యంగా లడ్డూ తయారీ కేవలం కొన్ని ఆలయాల్లో స్వయంగా తయారుచేస్తున్నారు. వీటిలో మన్యం కొండ, జోగులాంబ, మద్దిమడుగు, బీచుపల్లి, ఉమామహేశ్వరం ఆలయాల్లో మాత్రం లడ్డూల తయారీ ఉంటోంది. మిగతా అన్ని దేవాలయాల్లో టెండర్ల ద్వారా మాత్రమే లడ్డూ ప్రసాదం విక్రయాలు చేస్తున్నారు. ఇందులో ఒక్క బీచుపల్లి ఆలయంలో మాత్రమే లడ్డూల తయారీలో నెయ్యి వినియోగిస్తుండటం విశేషం.

6బి జాబితాలో..

మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయం, గూడెబల్లూర్ వేంకటేశ్వరాలయం, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి ఆలయం, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, కందూరు రామలింగేశ్వర ఆలయం, వేంకటేశ్వర ఆలయం వనపర్తి ఉండగా, గ్రూప్ 6సిలో బుద్ధారం గండిఆంజనేయస్వామి ఆలయం, మావిళ్లపల్లి లక్ష్మీనర్సింహాలయం ఉన్నాయి.

నాణ్యత ఎంత..

ఆలయాల్లో లడ్డూప్రసాదం భక్తులకు అందించేందుకుగాను టెండర్లు పిలుస్తున్నారు. ఒక లడ్డూ ధర కేవలం రూ.15 మాత్రమే నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లా అంతటా లడ్డూ తయారీలో పేరున్న కంపెనీ నూనె వినియోగిస్తున్నారు. కేవలం 75 గ్రాముల నుంచి 80 గ్రాముల బరువు ఉండేలా లడ్డూ తయారీలో కేవలం నెయ్యి వినియోగించాలన్న నిబంధన ఏదీ టెండర్లలో పేర్కొనకపోవడంతో లడ్డూలు నాణ్యతలేని నూనె వినియోగించి తయారుచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తక్కువ ధరతో లడ్డూల విక్రయాలకు అధికధర గల నెయ్యి ఎలా సమకూర్చాలన్న కారణంతో గుత్తేదార్లు నూనె వినియోగిస్తున్నారు. లడ్డూ నాణ్యతపై అక్కడక్కడ చిన్నచిన్న ఫిర్యాదులు వచ్చినా.. ఆయా చోట్ల దేవాదాయ శాఖాధికారులు స్పందించి చర్యలు చేపడుతున్నారు. ఆలయాల వద్ద లడ్డూ విక్రయాలు భక్తులు రాకపోకలు సాగించే చోట అపరిశుభ్ర వాతావరణంలో చేపడుతుండటంతో భక్తులు అనారోగ్యాలకు గురయ్యేప్రమాదం ఉంది.

ప్రసాదం నాణ్యతకు ప్రాధాన్యం..

ఆలయాల్లో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యత ఉండేలా గుత్తేదార్లపై ఒత్తిడి తెస్తున్నాం. రిఫైండ్ ఆయిల్ వినియోగించి లడ్డూలు తయారుచేస్తున్నారు. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.
- మదనేశ్వర్‌రెడ్డి, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్

విద్యుత్తు అధికారుల గొడవ.. విచారణకు ఆదేశం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఓల్డ్ పవర్‌హౌస్‌లో ఏఈ, లైన్‌మెన్ ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని విద్యుత్ నియంత్రిక చుట్టూ ముళ్ల పొదలు, చెత్తాచెదారం తొలగించేందుకు అదనపు సిబ్బందిని పురమాయించే విషయంలో ఏఈకి, లైన్‌మెన్‌కు మధ్య మాటామాటా పెరిగి కొట్టుకునే వరకు వెళ్లినట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం సంఘటన జరగగా విషయం బయటకు పొక్కకుండా అధికార వర్గాలు జాగ్రత్త పడ్డాయి. ఘర్షణలో దెబ్బలు తిన్న ఏఈ, మరో లైన్‌మెన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై రెండో పట్టణ ఠాణాకు చేరుకుని అదేరోజు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదు. మరుసటి రోజు ఏఈకి మద్దతుగా డిప్లొమా ఇంజినీర్ అసోసియేషన్, లైన్‌మెన్‌కు మద్దతుగా 1104 ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్‌ఈకి, డీఈకి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఎస్‌ఈ పీవీ రమేశ్ డీఈని ఆదేశించారు. డీఈ ఏడీతో కలిసి ఇరు వర్గాల వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఘటన ఎండీ వరకు వెళ్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, సస్పెన్షన్ ప్రమాదం లేకపోలేదని భావించిన లైన్‌మెన్ యూనియన్ ప్రతినిధులు ఏఈపై ఒత్తిడి తెచ్చి ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా రాజీ కుదిర్చినట్లు సమాచారం. ఎస్‌ఈ పీవీ రమేశ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఘటన జరిగినట్లు తెలిసిందని, విచారణ కోసం డీఈని ఆదేశించామని తెలిపారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్ కవాటాలు

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని సరళాసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతంలో విస్తరించిన పెద్ద, బుర్ర వాగుల నుంచి వరద నీరు భారీగా రావడంతో ప్రాజెక్టుకు ఉన్న ఆటో మేటిక్ సైఫన్ల కవాటాలు తెరచుకున్నాయి. మంగళవారం సాయంత్రం ఒక ప్రైమింగ్, రెండు ఉడ్ సైఫన్ కవాటాలు తెరచుకుని నీటిని బయటకు విడుదల చేసింది. సుమారుగా 5 వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందని ప్రాజెక్టు ఏఈఈ రణిల్‌రెడ్డి తెలిపారు. ఈ నీరంతా ఊక చెట్టు వాగు మీదుగా రామన్‌పాడ్ జలాశయానికి చేరుతున్నాయి.

చెంచు పెంటల్లో మౌలిక వసతులు



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : చెంచు పెంటల్లో జీవనం సాగిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు అందేలా చూడాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో పీఎం జన్ మన్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు చెంచు పెంటల్లో పూర్తయిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న 88 ఆదివాసి చెంచు పెంటల్లో ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. 11 రకాల వసతులు తప్పనిసరిగా అందించాలని సూచించారు. వారం రోజుల్లో అందరికి ఆధార్‌కార్డులు అందించాలని ఆదేశించారు. మంజూరైన 890 ఇళ్లు, రహదారులు, తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్తు కనెక్షన్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. చెంచు సభ్యుల జాబితా తయారు చేసి ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇవ్వాలని తెలిపారు. అందరికి జన్‌ధన్ ఖాతాలను తెరిపించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేశ్, డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో వేగంగా సౌర విద్యుత్తు పనులు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ నుంచి విద్యుత్తు శాఖ అధికారులతో కొండారెడ్డిపల్లి సౌర విద్యుత్తు పనులపై గూగుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్తు శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో సమీక్షించారు. సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ.. ప్రభుత్వం సౌర విద్యుత్తును వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొండరెడ్డిపల్లిని ఎంపిక చేసిందన్నారు. త్వరలో కొండారెడ్డిపల్లిలో పర్యటించి పరిశీలిస్తానని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లిలో గృహ అవసరాలకు సంబంధించిన కనెక్షన్లు 499, వాణిజ్య 66, పరిశ్రమలు 10, వ్యవసాయ కనెక్షన్లు 867 ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటికి కావాల్సిన విద్యుత్తు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రామంలో కుటుంబాల వారీగా పేర్ల నమోదు ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. సౌర విద్యుత్తు పనులను వేగవంతంగా చేయాలన్నారు. సోలార్ ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి నోడల్ అధికారి డా. జీవీ రమేశ్, విద్యుత్తు శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈ, శ్రీధర్‌శెట్టి, డీపీవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వేళాయె

నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

అచ్చంపేట, రాజోలి, న్యూస్‌టుడే : యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవాలను నిర్వహిస్తోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటిని ఈనెల 25 నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాల్లో పోటీలు ఉంటాయి.

జానపద నృత్యాలు : పోటీలు రెండు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఒక విభాగంలో పదిమందితో కూడిన బృందం 15 నిమిషాలపాటు నృత్య ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. రెండో విభాగంలో 7 నిమిషాల పాటు వ్యక్తిగత ప్రదర్శన ఉంటుంది. వ్యక్తిగత ప్రదర్శనలో గరిష్ఠంగా ఐదుగురు పాల్గొనవచ్చు. **జానపద గేయాలు :** బృందం, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు ఉంటాయి. జానపద గేయాలను 7 నిమిషాల వ్యవధిలో పాడాల్సి ఉంటుంది. **కవిత్వం :** గంట సమయంలో 50 పదాల్లో కవితలు రాయాలి. **వ్యాసరచన :** ఎంపిక చేసిన అంశంపై గంట వ్యవధిలో వెయ్యి పదాల నిడివితో వ్యాసం రాయాలి. **పోస్టర్ తయారీ :** అధికారులు ఇచ్చిన ఇతివృత్తంపై 90 నిమిషాల్లో పోస్టర్ తయారు చేయాలి. **ఉపన్యాస పోటీలు :** లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశాన్ని అభ్యర్థులకు కేటాయిస్తారు. మూడు నిమిషాల్లో ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లం లేదా హిందీలో మాట్లాడాలి. **విజ్ఞాన మేళా :** సైన్స్ మేళాను తొలిసారి నిర్వహిస్తున్నారు. సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శిస్తారు.

హస్త కళల ప్రదర్శన : హస్త కళలు, దుస్తులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు ముఖాముఖిలో పాల్గొంటారు.

మూడు దశల్లో.. : పోటీలను మూడు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఉంటాయి. ప్రతిభ చాటిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారు. రెండో దశలో రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. మూడో దశ పోటీలను స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 12-16వ తేదీ వరకు జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు.



జానపద నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు

దరఖాస్తుల ఆహ్వానం..

ఈనెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు 15-29 ఏళ్ల వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు రెండు కలర్ ఫొటోలు, ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రం జత చేసి అందజేయాలి.
- సీతారాం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, నాగర్‌కర్నూల్

పోటీలు నిర్వహించే వేదికలు

జిల్లా	తేదీ	వేదిక
జోగులాంబ	28	ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల
నాగర్‌కర్నూల్	28	సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్
నారాయణపేట	30	గ్రౌండ్ స్కూల్ స్టడీహాల్
వనపర్తి	26	ఇండోర్ స్టేడియం, వనపర్తి
మహబూబ్‌నగర్	25	డీఎస్‌ఏ మైదానంలోని ఇండోర్ స్టేడియం



తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే చర్యలు: డీకే అరుణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : తిరుమల తిరుపతి పవిత్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో మంగళవారం భాజపా సభ్యత్వ కార్యశాల కార్యక్రమం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో నాసిరకం, నెయ్యి వినియోగించినట్లు ధ్రువీకరణ పత్రాలు వెలువడిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, భక్తుల మనోభావాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని తీవ్రంగా భావిస్తోందని చెప్పారు. హిందూ ధార్మికతను కాపాడే అంశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. ఆయా మతాల ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలను రాజ్యాంగం పరిధిలో పరిరక్షించేందుకు కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ, మేర్వ రాజు, పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి పాల్గొన్నారు.

29న ఎంవీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈ నెల 29న కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కెఎస్ రవికుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ఆశయంతో 1965లో మహబూబ్‌నగర్ విద్యా సమితి(ఎంవీఎస్) పేరుతో పల్లెర్ల హనుమంతరావు, డీకే సత్యారెడ్డి, రాంచంద్రారెడ్డి, సత్తూరు రంగయ్య వంటి ప్రముఖులు కళాశాల స్థాపించారని, 2025 సంవత్సరంలో 60 ఏళ్లు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణారెడ్డి, రాజేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్ గౌడ్, వినోద్‌కుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి రిమాండ్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్‌బీఐలో డబ్బులు స్వాహా చేసిన బ్యాంకు ఉద్యోగికి రిమాండ్ విధించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు కిరణ్‌కుమార్ 2018 నుంచి 2023 వరకు బ్యాంకులోని ప్రజల ఖాతాల నుంచి రూ.1,49,50,000 తన భార్య ప్రశాంతితో పాటు మరికొందరి ఖాతాల్లోకి బదిలీ చేశాడు. గుర్తించిన శాఖ మేనేజర్ హుస్సేన్ బాషా ఇదివరకే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి విజయ్‌కుమార్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చెరువులో పడి కార్మికుడి గల్లంతు

జడ్చర్ల, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ కార్మికుడు చెరువులో పడి గల్లంతైన ఘటన జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోకల జంగయ్య (65) పంచాయతీలో నీటిసరఫరా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలోని పెద్ద చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకు ఆచూకీ లభించలేదని సీఐ తెలిపారు. తిరిగి ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అన్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, భారాస నాయకులు ఇంతియాజ్, గ్రామ నాయకులు అక్కడకు చేరుకున్నారు.

మండలానికి ఒకే విద్యాధికారి

76 మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్న ఎంఈవోలు

పాలమూరు, అచ్చంపేట, నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : మండలానికి ఒకే విద్యాధికారి ఉండేలా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లకే మండల విద్యాధికారులుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇన్నాళ్లు ఒకే ఇన్‌ఛార్జి ఎంఈవోకు ఎక్కువ మండలాల బాధ్యతలు అప్పగించటంతో పర్యవేక్షణ కొరవడింది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా ఉన్నత పాఠశాలల్లోని సీనియర్ జీహెచ్‌ఎంలు మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా మరికొందరు పనిచేస్తున్నారు. ఇక నుంచి ఒక్కరే ఉండనున్నారు. ఎంఎన్‌వో పోస్టు అనేది ఇక నుంచి ఉండదు. మండలానికి ఎంఈవో మాత్రమే ఉండనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలుగా మహబూబ్‌నగర్ అర్బన్‌కు లక్ష్మణ్‌సింగ్, కల్వకుర్తికి శంకర్ ఉన్నారు. కొత్త నియమితులైన వారు 76 మండలాల్లో విద్యాధికారులు పాలన పగ్గాలు చేపట్టనున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, తొలిమెట్టు, లిప్ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఏకరూప దుస్తుల, పాఠ్య పుస్తకాల పంపిణీ, బిల్లుల చెల్లింపు తదితరాలన్నీ వారే నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా మండలంలో ఇక నుంచి ఎంఈవోనే విద్యకు సంబంధించిన అన్ని రకాల సేవలు అందిస్తారని, వ్యవస్థ గాడినపడుతుందని తెలిపారు.

మండలాల వారీగా ఎంఈవోలు వీరే

జోగులాంబ గద్వాల జిల్లా : ఆర్.ఆశోక్‌కుమార్ (అలంపూర్), రవీంద్రాబాబు (ధరూర్), శ్రీనివాస్‌గౌడ్ (గద్వాల), నల్లారెడ్డి(గట్టు), డి.రాములు (అయిజ), జె.అమీర్‌పాషా (ఇటిక్యాల), కె. వెంకటేశ్వర్‌రావు (కేటీదొడ్డి), జి.సురేశ్ (మల్దకల్), బి.శివప్రసాద్ (మానవపాడు), భగీరథరెడ్డి (రాజోలి), రామకృష్ణ (ఉండవల్లి), బి.నర్సింహ (వడ్డేపల్లి), సి.వెంకటేశ్వర్లు (ఎర్రవల్లి).

మహబూబ్‌నగర్ జిల్లా : కురుమూర్తి (అడ్డాకుల), శంకర్ (బాలానగర్), ఉషారాణి (భూత్పూర్), మురళీకృష్ణ (చిన్నచింతకుంట), బలరామ్ (దేవరకద్ర), జనార్దన్ (గండీడ్), గోపాల్‌నాయక్ (హన్వాడ), మంజుల (జడ్చర్ల), వెంకట్‌జీ (కోయిలకొండ), మంజులత (కౌకుంట్ల), కృష్ణయ్య (మహబూబ్‌నగర్ గ్రామీణం), రాజునాయక్ (ముమ్మడాబాద్), సుధాకర్ (మిడ్జిల్), ఎస్. రాజేశ్వర్‌రెడ్డి (మూసాపేట), నాగ్యానాయక్ (నవాబ్‌పేట), సుధాకర్ (రాజాపూర్).

నాగర్‌కర్నూల్ జిల్లా : పి.జీవన్‌కుమార్ (అచ్చంపేట), ఎ.బాలకృష్ణ (అమ్రాబాద్), వి.విష్ణుమూర్తి (బల్మూర్), ఎన్.రాములు (బిజినేపల్లి), ఆర్.యూన్సీరాణి (చారగొండ), ఎం.నిర్మల (కోడేరు), ఇమ్మాన్యూల్(కొల్లాపూర్), బషీర్ అహ్మద్ (లింగాల), కె.భాస్కర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), బుచ్చిబాబు (పదర), శ్రీనివాస్‌రెడ్డి (పెద్దకొత్తపల్లి), సి.కుర్మయ్య (పెంట్లవల్లి), జి.శ్రీనివాస్‌రెడ్డి (తాడూరు), సి.శ్రీనివాస్‌రెడ్డి (తెల్కపల్లి), సత్యనారాయణ (తిమ్మాజీపేట), చంద్రశేఖర్ (ఉప్పునుంతల), మురళీమోహన్ (ఉర్కొండ), మురళీ మనోహరాచారి (వంగూరు), ఎస్.చంద్రుడు (వెల్దండ).

నారాయణపేట జిల్లా : ఎస్.కృష్ణారెడ్డి (దామరగిద్ద), ఎం.గాయత్రి (ధన్వాడ), ఎం.శేఖర్‌రెడ్డి (గుండ్‌మాల్), శేఖర్‌నాయక్ (కోస్గి), ఆర్.ఆంజనేయులు (కొత్తపల్లి), నిజామొద్దీన్ (కృష్ణా), బాలకిష్టప్ప (మద్దూర్), మురళీధర్‌రెడ్డి (మాగనూరు), అనిల్ గౌడ్ (మక్తల్), మనోరంజనీ (మరికల్), బాలాజీ (నారాయణపేట), ఎన్.రామకృష్ణ (నర్వ), కె.రాంచంద్రాచారి (ఉట్కూర్).

వనపర్తి జిల్లా.. : భాస్కర్‌సింగ్ (అమరచింత), బాలరాజు (ఆత్మకూర్), గణేశ్‌కుమార్ (చిన్నంబావి), పి.జయశంకర్ (ఘన్‌పూర్), కె.శ్రీనివాస్‌గౌడ్ (గోపాల్‌పేట్), జె.కృష్ణయ్య (కొత్తకోట), ఫరూఖ్ హుస్సేన్ (మదనాపూర్), శ్రీనివాసులు (పాన్‌గల్), ఎస్.జయరాములు (పెబ్బేరు), బి.విష్ణు (పెద్దమందడి), ప్రసాద్ (రేవల్లి), హన్మంతు (శ్రీరంగాపూర్), మద్దిలేటి (వనపర్తి), నర్సింహ (వీపనగండ్ల), జి.బుచ్చిరెడ్డి (ఎదుల్లా).



కోయిలకొండలోని మండల వనరుల కేంద్రం

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

తెరపై ఈనాడు

శ్రీరామా: 100 కోట్లు, **వెంకటేశ్వర:** మత్తు వదలరా-2
శ్రీనివాస: సరిపోదా శనివారం
– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం


గోడ పత్రికలను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, విద్యార్థులు

పెబ్బేరు, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యల పరిష్కారంపై పీడీఎస్‌యూ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. అక్టోబరు 24న హైదరాబాద్‌లో జరిగే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద ఉత్సవాలకు సంబంధించి మంగళవారం పట్టణంలోని ఓ ఒకేషనల్ కళాశాలలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ ఉత్సవాల్లో 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమాన్ని సమీక్షించి వారి స్ఫూర్తితో భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. శరణ్య, ఇందు, రవళి, సంధ్య, భానుమతి పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని మంగళవారం ఆత్మకూరులో విద్యాశాఖ ఒప్పంద ఉద్యోగులు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రాన్ని సమర్పించారు. 18 ఏళ్లుగా సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమం అమలులో ఆయా విభాగాల్లో విధుల్లో కొనసాగుతున్న తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సౌమ్యారాణి, మహేశ్వర్, బాలకృష్ణ, చిన్న భాగ్యమ్మ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలుపుదాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ పటిష్ఠతకు పునాదిగా భావించాలని లోక్‌సభ సభ్యురాలు డీకే అరుణ పేర్కొన్నారు. ఆత్మకూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదుపై పురపాలికతో పాటు మండల స్థాయి కార్యశాలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచే దిశగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తున్న పరిస్థితిని కార్యకర్తలు ప్రతి గడపకూ తీసుకువెళ్లాలని సూచించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం సభ్యత్వ నమోదులో దేశంలోనే ఆదర్శంగా నిలవాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శులు మధుకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోండి

వీపనగండ్ల(చిన్నంబావి) న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఎడ్యుకేషన్ వింగ్ కన్వీనర్ కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ఓ పాఠశాల ఎదుట క్షుద్ర పూజలు చేసిన నేపథ్యంలో మంగళవారం ఆయన పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కంప్యూటర్ యుగంలో మూఢ నమ్మకాలను విడనాడలన్నారు. జితేందర్‌గౌడ్, వెంకటరమణ, రవి, నాగశేషు, హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

గీత కార్మికుల ఘర్షణ

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పుర పరిధిలోని చెలిమిళ్ల గ్రామంలో మంగళవారం సొసైటీకి తెలియకుండా కల్లు అమ్ముతున్న దుకాణదారుడి ఇంటికి వెళ్లి ఘర్షణ పడిన ఘటన చోటు చేసుకుంది. కార్మికులు మాట్లాడుతూ.. సొసైటీలో విభేదాల వల్ల రెండు సంవత్సరాలుగా కల్లు అమ్మకాలు నిలిపి వేశామని, సొసైటీలో ఉన్న 114 మందిలో 34 మంది ఒక గ్రూపుగా ఏర్పడ్డారని తెలిపారు. సొసైటీకి సమాచారం ఇవ్వకుండా లైసెన్స్ తెచ్చుకుని కల్లు అమ్ముతున్న సమాచారం తెలుసుకుని దుకాణదారుడి ఇంటికి వెళ్లి మీరు ఇలా చేయడం వల్ల 80 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెప్పారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

వీపనగండ్ల(చిన్నంబావి) న్యూస్‌టుడే: పొగాకు, మాదకద్రవ్యాలు వాడటం ఆరోగ్యానికి హానికరమని వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.రాజశేఖర్ అన్నారు. మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మాదకద్రవ్యాలను వాడటాన్ని నిషేధించిందని చెప్పారు.

కొత్తకోట గ్రామీణం : పొగాకుతో తయారు చేసే బీడీ, సిగరేట్ వంటి వాటికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని వైద్యురాలు లక్ష్మి అన్నారు. పొగాకు వాడటం వల్ల క్యాన్సర్ ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు వివేకానంద, పర్యవేక్షకురాలు ప్రమీల, ఏఎన్ఎం జయంతి పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

కొత్తకోట, న్యూస్‌టుడే: బీసీ కుల గణనను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న తలపెట్టిన కులగణన మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బీమన్ననాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తకోటలో బీసీ నాయకులతో కలిసి ఆందోళన కరపత్రాలను విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చేసిన కులగణన ప్రకటనకు కట్టుబడి వెంటనే పాటించాలని డిమాండ్ చేశారు. బాలరాజుగౌడ్, తిరుపతయ్య, నరేందర్‌గౌడ్, శరత్‌గౌడ్ పాల్గొన్నారు.

మహాగర్జన జయప్రదం చేయండి

కొత్తకోట, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి కోరారు. మంగళవారం కొత్తకోటలో జిల్లా కార్యదర్శి ఆదితో పాటు ప్రైవేటు కళాశాల విద్యార్థులతో కలిసి మహాగర్జన గోడపత్రికను విడుదల చేశారు. ఈ నెల 27న చలో హైదరాబాద్ పేరుతో ఇందిరా పార్క్ వద్ద జరిగే విద్యార్థి మహా ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాజవర్ధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సొంత డబ్బులతో చెరువుల్లో చేప పిల్లలు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఏదుల మత్స్యకారులు తమ సొంత డబ్బులు రూ.2.5లక్షలు వెచ్చించి చేపపిల్లలను కొని చెరువుల్లో వదిలారు. గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను వదిలేదని, ఈ సంవత్సరం ప్రభుత్వం చేపపిల్లలను సరఫరా చేయకపోవడంతో గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.2.5లక్షలను వెచ్చించి 3లక్షల చేపపిల్లలను పెద్దచెరువు, చిన్నచెరువులో వదిలామని సంఘం అధ్యక్షుడు గువ్వల హుస్సేన్ తెలిపారు. గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలుపట్టే వృత్తితోనే జీవిస్తున్నారని చెప్పారు. సైదులు, హనుమంతు, వెంకటయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ పునరావాసానికి రూ.45 కోట్లు విడుదల

తండాలవాసుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.16 లక్షల జమ

న్యూస్‌టుడే, జడ్చర్ల : కొన్ని నెలలుగా నిర్వాసితులు ఎదురుచూస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు ప్రభుత్వం రూ.45,59,59,130 నిధులు విడుదల చేసింది. నాలుగు గిరిజన తండాల్లోని ఒక్కో నిర్వాసితుడి బ్యాంకు ఖాతాల్లో రూ.16,30,249 చొప్పున ప్యాకేజీ జమ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా కలెక్టర్ విజయేందిర బోయి ధ్రువీకరించారు. ఉమ్మడి జిల్లాలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులు బుధవారం పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు. మొదటగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ జలాశయం వద్ద పనులను మంత్రులు పరిశీలించనున్నారు. మంత్రుల రాక సందర్భంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయడం నిర్వాసితులకు ఊరటనిస్తున్న అంశం. ఇటీవల జలాశయం పనులు చేపట్టేందుకు గుత్తేదారులు సన్నాహాలు చేయగా నిర్వాసితులు అడ్డుకున్నారు. పునరావాసం, పరిహారం డబ్బులు చెల్లించాకే పనులు చేపట్టాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ జలాశయం కోసం భూసేకరణ చేసిన సుమారు 4వేల ఎకరాల భూమికి పరిహారం విడుదల చేశారు. రూ.12 లక్షల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ముంపు గ్రామాల్లో బాధితులు కోల్పోతున్న స్థిరాస్తులు ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సర్వే పూర్తిచేసినా నిధులు విడుదల కాలేదు. పునరావాస కాలనీ ఏర్పాటు ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. గత శాసనసభ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ చేపడతామని అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి ప్రకటించినా ప్రభుత్వం మారడంతో పాటు ఆయన ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కూడా ప్రత్యేకంగా కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి నిధుల మంజూరు చేశారు. మొదటి విడతగా 4 తండాల నిర్వాసితుల ఖాతాల్లో జమచేశారు. వల్లూరు, ఉదండాపూర్ నిర్వాసితులకు కూడా నిధులు మంజూరయ్యాయని, లబ్ధిదారుల జాబితాలో దాదాపు 300 మంది అనర్హుల పేర్లను చేర్చినట్టు ప్రభుత్వం గుర్తించిందని, మరోమారు సర్వే చేశాక డబ్బులు జమ అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.



తండావాసుల ఖాతాలో జమ చేసిన పరిహారం డబ్బుల సంక్షిప్త సమాచారం


మదనాపురం సమీపంలో ఉన్న లో లెవెల్ వంతెనపై పారుతున్న నీరు

పొంగిన వరద.. నిలిచిన రాకపోకలు

మదనాపురం, న్యూస్‌టుడే : సరళాసాగర్ జలాశయం ఆటోమేటిక్ సైఫన్ కవాటాలు తెరచుకోవడంతో వరద నీరంతా ఊకచెట్టు వాగులోకి భారీగా వచ్చి చేరుతోంది. వరద ఉద్ధృతికి మదనాపురం-ఆత్మకూర్ ప్రధాన రహదారిపై మదనాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న లో లెవెల్ వంతెన పైన నీరు పొంగడంతో మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి వివిధ మండలాలు, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముందస్తుగా వాగు వద్ద పరిస్థితిని గమనించిన ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వంతెనపై వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నారు.

హామీలు అమలు చేస్తాం


లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అమరచింత పట్టణం, నాగల్‌కడ్మూర్ గ్రామంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా సిలిండర్ రాయితీ పొందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అమరచింత పురపాలక సంఘానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్నారు. ధుంపాయికుంటలోని ఇళ్ల స్థలాలను అర్హులకు అందేలా కలిసి పని చేద్దామన్నారు. పుర అధ్యక్షురాలు వి.మంగమ్మ, ఉపాధ్యక్షుడు గోపి, కమిషనర్ నూరుల్ నజీబ్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ కల్లుగీత సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగరాజుగౌడ్, ఆయూబ్ ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. నాగల్‌కడ్మూర్ గ్రామంలో సీఐ శివకుమార్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం గర్వకారణమన్నారు. కొత్తగా మంజూరైన 33/11 కేవీకి గ్రామానికి చెందిన యువకుడు స్థలం ఉచితంగా ఇచ్చారన్నారు. అమ్మాపూర్ సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని జడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులకు స్థలం ఉచితంగా ఇచ్చి ఆదర్శంగా నిలిచారని తెలిపారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకుంటే చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. జాతీయ సేవా పథకం ఉద్దేశాలు, విలువల గురించి ఆయన వివరించారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ అక్షరాలతో మానవహారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు రూప, మంజుల పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : వచ్చే స్థానిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు విజయం సాధించి, పార్టీ జెండాను ఎగురవేస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని శేరుపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడితో పాటు, సర్పంచ్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి హాజరై ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ప్రధాని మోదీ పాలనలో దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతో మంది ఆయన సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. ఎల్లస్వామి, నరేశ్, రాకేశ్, వెంకటస్వామి, రాముడు, గుంటి శివ, కార్తిక్, గణేశ్ పాల్గొన్నారు.

వనపర్తి(గ్రామీణం : పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టినట్లు అధ్యక్షుడు బచ్చురాము తెలిపారు. ప్రభాకర్, పట్టణ ఆర్యవైశ్య యువజన అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : దేశానికి విశ్వనాయక ప్రధాని మోదీ అని భాజపా వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వెనికితండాలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబునాయక్ ఆధ్వర్యంలో వివిధ బూత్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, సత్యనారాయణ, కేశవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

అమరచింత, న్యూస్‌టుడే : అమరచింత మండల తహసీల్దార్ రమేశ్‌రెడ్డి మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. రెండు నెలల కిందట బదిలీపై వచ్చిన ఆయన ఆకస్మికంగా బదిలీ కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రవికుమార్ పదోన్నతిపై అమరచింతకు తహసీల్దార్‌గా వస్తున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యతో పాటు విద్యార్థులు క్రీడా రంగంలో కూడా రాణించాలని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కృషి చేయాలని మార్కెట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య మైదానంలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాసులుగౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అండర్ 17 మండల పాఠశాల స్థాయి ఖో ఖో లో బాలికలు పెద్దగూడెం ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానం మైనార్టీ గురుకుల వనపర్తి, కబడ్డీలో పెద్దగూడెం ఉన్నత పాఠశాల బాలికలు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో మైనార్టీ బాలికలు, కబడ్డీలో వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ, చిట్యాల బీసీ గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో, వాలీబాల్‌లో చిట్యాల ఉన్నత పాఠశాల ప్రథమ, చిట్యాల బీసీ గురుకుల పాఠశాల, ద్వితీయస్థానంలో, బాలికలలో మైనార్టీ గురుకుల వనపర్తి ప్రథమ, చిట్యాల ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి.

అండర్ 14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక : సెప్టెంబరు 26వ తేదీన జిల్లా కేంద్రంలోని మైదానంలో బాలుర క్రికెట్ ఎంపిక నిర్వహిస్తున్నారని, ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. పాఠశాల యొక్క ఒరిజినల్ బోనోఫైడ్, ఆధార్‌కార్డు ధ్రువపత్రాలతో హాజరు కావాలని, 2011 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. 9441565805, 7386110914లను సంప్రదించాలన్నారు. యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, పీడీ సురేందర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలో భగత్‌సింగ్ నగర్ శివారులో ఆత్మకూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడారు. ఆత్మకూరు, అమరచింత, మరికల్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటుతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. సమస్యతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమేశ్‌రెడ్డికి సమర్పించారు. విజయ్, నెపోలియన్, బుచ్చన్న, సుజ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

సంత స్థలానికి రక్షణ గోడ ఏర్పాటు చేస్తా


మార్కెట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రమోదినిరెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, మార్కెటింగ్ జిల్లా అధికారి, తదితరులు

పెబ్బేరు, న్యూస్‌టుడే: ఆసియాలోనే అతిపెద్ద సంతగా ఉన్న పెబ్బేరు సంత స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపలాదారుడిగా ఉంటూ 30.19 ఎకరాల స్థలానికి రక్షణ గోడ ఏర్పాటు చేయిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గతంలో భారాస రూ.లక్ష కూడా రుణమాఫీ చేయలేదని, మాఫీపై మాట్లాడే అర్హతలేదని విమర్శించారు. ఒకే రాష్ట్రం ఒకటే కార్డు అనే విధంగా డిజిటల్ రేషన్‌కార్డు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు మార్కెట్‌యార్డు అధ్యక్షురాలిగా ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా విజయవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా ఆంజనేయులు, కవిత, రామన్‌గౌడ్, షాహినీబేగం, రామకోటి, కృష్ణయ్య, నర్సింహానాయుడు, శంకర్, వెంకటేశ్ నాయక్, రాముడు, చంద్రకళ, బుచ్చయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, పుర అధ్యక్షురాలు కరుణశ్రీ, సింగిల్‌విండో ఛైర్మన్ జగన్నాథనాయుడు, బ్లాక్ కాంగ్రెస్ వనపర్తి అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు యాదవ్ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం : నాగరాలకు చెందిన స్వాతి, అశ్విత రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 20వేల నగదును అందిచడంతో పాటు, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయిస్తానని, మృతురాలి కుమారుడిని చదివించే బాధ్యత తనదేనని తెలిపారు. గుండె చికిత్స చేయించుకున్న శ్రీరంగాపురానికి చెందిన మానసను పరామర్శించారు. నరేందర్‌రెడ్డి, శ్రీహరిరాజు, రాజశేఖర్‌రెడ్డి, వహిదుద్దీన్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి(వనపర్తి న్యూటౌన్) న్యూస్‌టుడే: అల్వాల గ్రామంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన నర్సింహ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఖిల్లాగణపురం : గ్రామ దేవతలు ఎంతో మహిమ గల దేవతా మూర్తులని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఉప్పరిపల్లి గ్రామంలో ఏటా నిర్వహించే సవారమ్మ, సరస్వతమ్మ, మారెమ్మ, మైసమ్మ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సతీశ్, వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవసరం


కస్తూర్బాలో ట్యాంకులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది


పాన్‌గల్, న్యూస్‌టుడే : విద్యార్థులు నిత్యం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని జిల్లా ఉపవైద్యాధికారి డా.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పాన్‌గల్ కస్తూర్బా విద్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. పరిసర ప్రాంతాలు, తరగతి గదులను పరిశీలించారు. డా.చంద్రశేఖర్, ఏఎంవో కుమారస్వామి, సీహెచ్‌వో శ్రీనివాస్‌జీ, జిల్లా ఏఎల్‌వో టీం సభ్యులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో.. : జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా కేతేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. డా.తారకశంకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పరశురాములు, వైద్య సిబ్బంది సుమనశ్రీ, రామచందర్ పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : సంకిరెడ్డిపల్లి, తండాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి బోజనాయక్ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెంకటేశ్వరమ్మ, యశోద, దేవమ్మ పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం అలవడుతుందని ఖిల్లా సీహెచ్‌సీ డా.విజయ, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ పొగాకు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కాళీదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉండాలి


డా.కోయ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న మండల ప్రధానోపాధ్యాయులు

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉండాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డా.కోయ వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాలకు సంబంధించిన భౌతికశాస్త్రం సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల నోడల్ అధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు నరేందర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, కాంప్లెక్స్ ఆర్పీ శ్రీనివాసులు, ఖాదర్, శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం ధర్మ టీచర్ యూనియన్ పనిచేస్తుందని సంఘం జిల్లా కన్వీనర్ బండారు శ్రీనివాసులు అన్నారు. కేతేపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన భౌతికశాస్త్రం ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఆదివెంకట్, భీముడు, కృష్ణయ్య, కురుమూర్తి, గోవర్ధన్ పాల్గొన్నారు.

మంచినీటి మోటార్ల మరమ్మతులపై శిక్షణ


మాట్లాడుతున్న ఈఈ మేఘారెడ్డి

పెద్దమందడి(వనపర్తి న్యూటౌన్) న్యూస్‌టుడే: మంచినీటి బోరుబావి మోటార్లు, ప్యానెల్‌బోర్డుల మరమ్మతులపై గ్రామ మంచినీటి సహాయకులు అవగాహన కలిగి ఉండాలని మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గ్రామ మంచినీటి సహాయకులకు సింగిల్, త్రీఫేస్, ప్యానెల్‌బోర్డుల మరమ్మతులపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. గ్రామ సేవకుడికి 8వ తరగతి ఉత్తీర్ణత, 20 నుంచి 45 ఏళ్లు ఉన్నవారు అర్హులని తెలిపారు. నీటిని శుద్ధి చేసే విధానం గురించి వివరించారు. ఎంపీడీవో సద్గుణ, మిషన్‌భగీరథ ఏఈ హరీశ్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం


నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : కానాయపల్లి శంకరసముద్రం జలాశయం అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కానాయపల్లి శంకరసముద్రం జలాశయాన్ని బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతర మంత్రుల బృందం పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, బీచ్‌పల్లి, జితేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంఘిక ఉపాధ్యాయులకు శిక్షణ

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సాంఘిక ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ప్రారంభించనున్నట్లు జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం అధ్యక్షుడు భగవంతు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అంబులెన్సులో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఏదుల మండలం మాచుపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి మూడో కాన్పుకోసం మంగళవారం రాత్రి అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. 108లో ఆమెను గోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో చెన్నారం శివారులో నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది వాహనంలోనే కాన్పు చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. కాన్పుకు సహకరించిన 108 సిబ్బంది పైలట్ లోకేశ్, టెక్నీషియన్ రిజ్వాన్‌లను అభినందించారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దమందడి(వనపర్తి న్యూటౌన్) న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామంలో ఊరంచు చెరువులో సోమవారం రాత్రి కొత్తకోట నర్సింహ(55), కొత్తకోట మండలం అప్పరాల గ్రామానికి చెందిన మన్యంలు కలిసి చేపల పట్టుకునేందుకు వల వేశారు. నర్సింహ చెరువులో నీటి లోతును చూసేందుకు దిగి మునిగిపోయాడు. ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పారు. మంగళవారం పోలీసులకు సమాచారమివ్వగా ఎస్సై సిబ్బందితో అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లు, బోటు సాయంతో చెరువులో వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య మనెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలకేంద్రానికి చెందిన వేదవతి, శివరాములు మంగళవారం తమ ఇంటికి తాళం వేసి భార్య వనపర్తికి, భర్త నాగర్‌కర్నూల్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకోవడానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాలో దాచిన అరతులం బంగారం, మూడు తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. విధుల నుంచి తిరిగి ఇంటికి వచ్చిన భార్యాభర్తలు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోని బీరువా తెరిచి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని వస్తువులు చోరీకి గురయ్యాయని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

నాగవరంలో కొండచిలువ పట్టివేత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం నాగవరంలో సోమవారం అర్ధరాత్రి ఓ ఫంక్షన్‌హాల్ ప్రహరీ గోడ వద్ద కొండచిలువను ఏఆర్ కానిస్టేబుల్ ముజారఫ్ చూసి గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తికి విషయం చెప్పారు. ఆ వ్యక్తి హోంగార్డు కృష్ణసాగర్‌కు కొండచిలువ ఉందని సమాచారమివ్వగా అక్కడికి చేరుకుని పట్టుకున్నారు. మంగళవారం మర్రికుంట డీఎఫ్‌వో కార్యాలయానికి చేరుకుని డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అటవీక్షేత్రాధికారి బాచిరెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో పట్టుకున్న కొండచిలువను మండలంలోని పెద్దగూడెం క్రాస్ రోడ్డు అటవీప్రాంతంలో వదిలేశారు.